# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 17-05-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ జాతీయవాదం పట్ల అంకితభావాన్ని చిన్నప్పటి నుండే పిల్లలకు నేర్పించాలని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ పేర్కొన్నారు.
- ❖ ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చేపట్టిన చర్యలను ప్రపంచ దేశాలకు వివరించడానికి కేంద్ర ప్రభుత్వం 7 అఖిలపక్ష బృందాలను ఏర్పాటు చేసింది.
- ❖ సుసంపన్న భారత నిర్మాణంలో ప్రవాస భారతీయులు భాగస్వాములు కావాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కోరారు.
- ❖ PSLV-C61 ద్వారా ఇస్రో 101వ రాకెట్ ప్రయోగాన్ని రేపు ఉదయం చేపట్టనుంది.
- ❖ ప్రధానమంత్రి నరేంద్రమోదీ “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 122వ సంచిక ఈనెల 25న ప్రసారమవుతుంది.

==================

“ఆపరేషన్ సిందూర్”తో ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసి భారత రక్షణ రంగం తన సమర్థతను ప్రపంచానికి చూపిందని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని జైపురియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్నాతకోత్సవంలో ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ... భద్రతా అంశాలలో వాణిజ్యం, వ్యాపారం, పరిశ్రమలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. పహల్గామ్ ఉగ్రవాద దాడికి ప్రతిస్పందనగా చేసిన ఆపరేషన్ లో భారత్ ఎంతో కచ్చితత్వంతో శాంతియుత వాతావరణానికి ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా ఉగ్రస్థావరాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుందన్నారు. ఆపరేషన్ సిందూర్ అద్భుతమైన విజయం సాధించినందుకు సాయుధ దళాలకు ఆయన అభినందనలు తెలిపారు. జాతీయవాదం పట్ల అంకితభావాన్ని చిన్నప్పటి నుండే పిల్లలకు నేర్పించాలని ఉపరాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్ 34 సెకన్లు)

==================

ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తున్న పాకిస్తాన్ చర్యలను ప్రపంచ దేశాలకు వివరించడం కోసం కేంద్ర ప్రభుత్వం 7 అఖిలపక్ష బృందాలను ఏర్పాటు చేసింది. ఆ ప్రతినిధుల బృందాలకు నాయకత్వం వహించే ఏడుగురు పార్లమెంటు సభ్యుల పేర్లను ఈరోజు ప్రకటించింది. కాంగ్రెస్ పార్టీ నుంచి సీనియర్ నాయకులు శశిథరూర్, భారతీయ జనతా పార్టీ నుంచి రవిశంకర్ ప్రసాద్, బైజయంత్ పాండా, జేడీయూ నుంచి కుమార్ ఝా, డీఎంకే నుంచి కనిమొళి, ఎన్సీపీ - ఎస్పీ పార్టీ నుంచి సుప్రియా సూలే, శివసేన పార్టీ నుంచి శ్రీకాంత్ శిందే విదేశాల్లో భారత బృందాలకు నాయకత్వం వహించనున్నారని కేంద్రం వెల్లడించింది. వీరి నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొత్తం ఏడు గ్రూపులు 10 రోజుల వ్యవధిలో వీదేశాలకు వెళ్లనున్నాయి. “ఆపరేషన్ సిందూర్”తో ఉగ్రవాదంపై భారత్ జరిపిన పోరాటం, భవిష్యత్ లో భారత్‌పై ఉగ్రదాడులు జరిగితే ప్రభుత్వం తీసుకునే చర్యలు వంటి అంశాలను ప్రపంచ దేశాలకు ఈ బృందాలు వివరించనున్నాయి. దీనిపై భారతీయ జనతా పార్టీ ఎంపీ రవిశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ…

(వాయిస్ 32 సెకన్లు)

==================

పహల్గాం ఘటన నేపథ్యంలో ముంబయిలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇద్దరు ఐసిస్ (ISIS) అనుమానిత ఉగ్రవాదులను జాతీయ దర్యాప్తు సంస్థ (NIA) అధికారులు ఈరోజు అరెస్ట్ చేశారు. ఇండోనేషియాలోని జకార్తా నుంచి భారత్‌కు వచ్చిన వీరిని విమానాశ్రయంలోని టెర్మినల్-2 వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో ఇమిగ్రేషన్ అధికారులు అడ్డుకున్నారని NIA తెలిపింది. ఐసిస్ స్లీపర్ సెల్ విభాగంతో వీరికి ఉన్న సంబంధాలు ఉన్నాయని గుర్తించామని వెల్లడించింది. తదుపరి చట్టపరమైన చర్యల కోసం ఇద్దరు నిందితులను NIA ప్రత్యేక కోర్టు ముందు హాజరుపరచనున్నామని అధికారులు తెలిపారు. కాగా రెండు సంవత్సరాలుగా పరారీలో ఉన్న వీరు భారత్-పాక్ ఉద్రిక్తతల సమయంలో ముంబయికి రావడానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్ఐఏ అధికారులు పేర్కొన్నారు. వీరితో కలిపి ఇప్పటివరకు 10 మంది ఐసిస్ సభ్యులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. 2023లో మహారాష్ట్రలోని పుణేలో ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైసెస్ (ఐఈడీలు) తయారీ, పరీక్షలకు సంబంధించిన కేసులో వీరికి ప్రమేయం ఉందని భారత్‌లో ఉన్న స్లీపర్ సెల్స్‌తో దేశంలో ఉగ్ర కుట్రలకు ప్రణాళికలు రచించినట్లు ఎన్ఐఏ అధికారులు వెల్లడించారు.

విరామం

==================

పాకిస్తాన్ కు గూఢచర్యం చేస్తున్నారనే ఆరోపణలపై హర్యాణ పోలీసులు ఈరోజు ఇద్దరిని అరెస్టు చేశారు. హిసార్‌కు చెందిన యూట్యూబర్ జ్యోతి రాణి, పాకిస్థాన్‌కు గూఢచర్యం చేస్తుందని ఆమెను అరెస్టు చేసి కేసు నమోదు చేశామనిశా హిసార్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కమల్జీత్ వెల్లడించారు. ఆమె పాకిస్తాన్ నిఘా సంస్థలతో సంప్రదింపులు జరుపుతోందని, సామాజిక మాధ్యమాల ద్వారా నిఘా సమాచారాన్ని పంపుతోందని తెలిపారు. అలాగే నాలుగుసార్లు పాకిస్తాన్ కు ప్రయాణించారని, దీని కారణంగా భారత భద్రతా సంస్థలు ఆమెపై నిఘా ఉంచాయన్నారు. జ్యోతిరాణిని కోర్టులో హాజరుపరిచి 5 రోజుల రిమాండ్‌కు తరలించామని తెలిపారు. పాకిస్తాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ తరపున గూఢచర్యం చేస్తున్నారనే ఆరోపణలపై కైతాల్‌లోని మస్తగఢ్ గ్రామానికి చెందిన 25 సంవత్సరాల దేవేందర్ సింగ్ అనే యువకుడిని కూడా హర్యానా పోలీసులు ఈరోజు అరెస్టు చేశారు.

==================

సుసంపన్న భారత నిర్మాణంలో ప్రవాస భారతీయులు భాగస్వాములు కావాలని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ కోరారు. ఈరోజు బ్రెజిల్‌లోని సావో పాలోలో జరిగిన కార్యక్రమంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ… భారతదేశంలోని పెట్టుబడి, ఆవిష్కరణలకు అవకాశాలు విస్తారంగా ఉన్నాయన్నారు. క్లీన్ ఎనర్జీ, ఇన్నోవేషన్ రంగాలలో పెట్టుబడులు పెట్టాలని బ్రెజిల్‌లోని ప్రవాస భారతీయులను ఆయన కోరారు. బలమైన ఆర్థిక వృద్ధి, వేగవంతమైన మౌలిక

సదుపాయాల అభివృద్ధిలో అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా ప్రపంచ వేదికపై భారతదేశాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడే జీవ ఇంధనాలను ప్రోత్సాహిస్తున్నామన్నారు. భారత సమాజ సాంస్కృతిక విలువలు, ఆవిష్కరణ, వ్యవసాయం, వాణిజ్యం, డిజిటల్ సహకారం వంటి అంశాలు భారతదేశం-బ్రెజిల్ సంబంధాలు మరింత ముందుకు తీసుకువెళుతున్నాయని నితిన్ గడ్కరీ పేర్కొంటూ...

(వాయిస్ 26 సెకన్లు)

==================

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో 101వ రాకెట్ ప్రయోగానికి సిద్ధమవుతోంది. రేపు ఉదయం 5 గంటల 59 నిమిషాలకు ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లాలో ఉన్న శ్రీహరికోట సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుండి PSLV-C61 ఉపగ్రహాన్ని ప్రయోగించనుంది. ఇందు కోసం ఈరోజు ఉదయం 7 గంటల 59 నిమిషాలకు కౌన్‌డౌన్ ప్రారంభమైంది. 22 గంటల పాటు కొనసాగే ఈ కౌన్‌డౌన్ ముగిసిన వెంటనే పీఎస్ఎల్వీ-సీ61 రాకెట్ నింగిలోకి వెళ్తుంది. దేశ సరిహద్దుల్లో నిఘా సామర్థ్యాన్ని పెంచి, దేశ భద్రతను పటిష్ఠం చేసే అత్యాధునిక రాడార్ ఇమేజింగ్ ఉపగ్రహం రీశాట్-బీ1 ను పీఎస్ఎల్వీ-సీ61 వాహక నౌక కక్ష్యలోకి తీసుకెళ్లనుంది. దేశ భద్రత, సైనిక అవసరాలకు అవసరమైన సమగ్ర సమాచారాన్ని అందించడంలో ఈ రీశాట్-బీ1 చాలా కీలకం కానుంది. ఉగ్రవాదుల స్థావరాలు, వారి కదలికలను పసిగట్టడంతో పాటు, సరిహద్దు ప్రాంతాలలో శత్రువుల బలగాలకు సంబంధించిన కార్యకలాపాలను కూడా నిశితంగా పరిశీలించి.. ఫొటోలను తీసి పంపుతుంది.

==================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 122వ సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 23వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

==================

భారత్-పాకిస్తాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలపై నేపధ్యంలో ఇరుదేశాలు పరస్పర చర్చలు జరపాలని రష్యా సూచించింది. ఈ విషయంలో ఇరుదేశాలు పరస్పర విశ్వాసంతో ముందుకు వెళ్లాలని కోరుకుంటున్నాం" అని రష్యన్ ఫెడరేషన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మరియా జఖరోవా పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం భారత్-పాకిస్తాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే అమెరికా ఇరు దేశాల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని స్వాగతించింది. భారత్, పాకిస్థాన్ సంఘర్షణ నివారణకు తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని ప్రకటించింది.

==================
==================